ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబర్ 2023
5
శ్రీ సత్యసాయి





చిత్రావతి నదిలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

వైసిపిలో కొనసాగుతున్న అలజడి..!

సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చుతారన్న ఊహాగానాలు

పలుచోట్ల నిరసనలు, రాజీనామాలు

తమ నాయకులకు ఇవ్వకుంటే పార్టీకి పనిచేయమని బెదిరింపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



వైసిపిలో అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తల నియమకాలపై స్పష్టత వస్తుండటంతో పార్టీలో అలజడి మొదలైంది. ఒకటి,రెండు రోజుల్లో నియోజకవర్గ సమన్వకర్తల నియమాకాలు చేపట్టే ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలుండటంతో ఆశావహుల్లో గుబులు రేగుతోంది. స్థానాన్ని పదిలం చేసుకునేందుకు శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు టిక్కెట్టుపై ఆశలు సన్నగిల్లిన వారు ఆందోళనబాట పట్టేందుకు సమాయత్తమవుతున్నారు. కదిరి, పెనుకొండల్లో రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మద్దతుదారులు రెండు రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం రోజు కొంత మంది తమ పదవులకు రాజీనామాలు చేశారు. గాండ్లపెంటలో కొంత మంది రాజీనామాలు చేసిన వారిలోనున్నారు. సిద్ధారెడ్డికే వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్టు ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ సమన్వయకర్తగా మక్బుల్‌ను నియమిస్తారన్న ప్రచారం సాగుతోంది. అధికారికంగా ఇంకా ప్రకటన రాలేదు. ఇంతలోనే నిరసనలు కొనసాగుతున్నాయి. ఇక పెనుకొండకు సంబంధించి కూడా మంత్రి ఉషచరణ్ శ్రీ తనకు పెనుకొండ టిక్కెట్టు ఖరారైందని చెప్పడంతో అక్కడా సమస్య ఉత్పన్నమైంది. శంకరనారయణకు మద్దతుగా కొంత మంది గళం వినిపిస్తున్నారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తను ఇది వరకే మార్చారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను మార్చి దీపికను నియమించారు. ఆ సమయంలోనూ వివాదం చెలరేగింది. ఇప్పటికీ నేతల మధ్య సమన్వయం కుదరలేదు. వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో దీపిక నియామకంపైనా ఒకనాకొన దశలో పునరాలోచన జరిగినట్టు చర్చ నడిచింది. రాయదుర్గం టిక్కెట్టును ఖరారు చేయించుకునేందుకు కాపు రామచంద్రారెడ్డి అమరావతిలోనే మకాం వేసి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదే బాటలో మరికొంత మంది తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలో పడ్డారు. నాలుగైదు స్థానాల్లో మినహా అన్ని చోట్ల మార్పులుండే అవకాశముందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒకటి,రెండు రోజుల్లో సమన్వయకర్తల ప్రకటన వెలువడనున్నట్టు సమాచారం. ప్రకటన వెలువడిన తరువాత పరిస్థితి ఏ రకంగా ఉంటుందన్న చర్చ నడుస్తోంది. మరికొన్ని చోట్ల వివాదాలు చెలరేగే అవకాశాలున్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే ఒక నాయకుడు తనకు టిక్కెట్టు లేదనిముందే చెబితే మరో పార్టీలో చేరి తెచ్చుకుంటానని ముఖ్య నేతల ముందు అల్టిమేటం జారీ చేసారన్న ప్రచారం నడుస్తోంది. వైసిపి సమన్వయకర్తల నియామకంపైనే రాజకీయాల్లో హాట్‌టాపిక్ నడుస్తోంది. ఎవరికి అవకాశమెంనన్తుంది..ఎవరికి రాదన్నదే సర్వత్రా నడుస్తున్న చర్చ. రాని వారి పరిస్థితి ఏ రకంగా ఉంటుంది..వారు ఏమి చేయనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. మొన్నటి వరకు నియోజకవర్గంలో అంతా తామేనని అనుకుంటూ వచ్చిన నేతలకు ఇప్పుడు ఒక్కసారిగా టిక్కెట్టు లేదని తెలిసే సరికి అయోమయంలో పడుతున్నారు. టిక్కెట్టు రాకపోయినా పార్టీలోనే కొనసాగాలా... లేక ఇతర పార్టీల్లోకెళ్లి కొత్త ప్రయత్నాలు చేసుకోవాలా అన్న మీమాంసలోనూ పడ్డారు. అయితే వచ్చే సమస్యలను అధిష్టానం ఏ రకంగా పరిష్కరించగలదన్నది చూడాల్సుంది.

'ఫ్యాను'కు ఎదురుగాలి

కదిరి టౌన్ : కదిరి నియోజకవర్గంలో వైసిపికి ఎదురుగాలి వీస్తోంది. 2024 జరిగే ఎన్నికలలో కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి టికెట్ ఇవ్వటం లేదన్న ఊహాగానాలు వినపడుతుండటంతో ద్వితియశ్రేణి నాయకులు, కార్యకర్తలు తమ అసంతృప్తిని వెళ్లగక్కాడు. ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు కదిరి ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపికి చెందిన పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను ఎంపిడిఒ అంజినప్పకు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి వైసిపిని స్థాపించినపుడు ఆయనకు మద్దతుగా పార్టీలోకి చేరామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సౌమ్యుడైన ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని కాదని మరొకరికి టికెట్ కేటాయిస్తున్నట్లు ఊహగానాలు వెలువడుతుండటంతో పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకస్తూ తమ పదవులకు రాజీనామా చేస్తున్నామన్నారు. వైసీపీ జెండా పట్టుకొని ఏనాడు పార్టీ కోసం పనిచేయని వ్యక్తులకు టికెట్ ఇవ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఒకవేళ మైనార్టీకి టికెట్ ఇవ్వాల్సి వస్తే పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారని ఎమ్మెల్యే సిద్ధారెడ్డితో మాట్లాడి వారికి ఇవ్వాలని సూచించారు. ఇక నంబులపూలకుంట మండలంలో ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీ లు , జెడ్పీటీసీ, కో ఆప్షన్ మెంబర్, ఇద్దరు సర్పంచులు, ఆరుగురు ఎంపీటీసీలు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తమ పదవులకు రాజీనామా చేశారు. కదిరి అసెంబ్లీ టికెట్ సిద్ధారెడ్డికే కేటాయించాలని పార్టీకి సంబంధం లేని వ్యక్తికి, స్థానికేతరుడికి టికెట్ కేటాయిస్తే పార్టీకి పనిచేసేది లేదని తేల్చి చెప్పారు.

గాండ్లపెంట :వచ్చే ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డికి కాదని మరొకరికి టికెట్ కేటాయిస్తున్నారన్న ఊహాగానాలకు నిరసనగా గాండ్లపెంట ఎంపిపి జగన్మోహన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఇఒఆర్‌డి సునీతకు అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకిస్తూ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. అదే విధంగా జెడ్పీటీసీ, వైస్ ఎంపిపిలు, ముగ్గురు ఎంపిటిసిలు, ఐదుగురు సర్పంచులు, కోఆప్షన్ మెంబర్, గృహ సారథులు కూడా తమ పదవులకు రాజీనామా చేసామని తెలిపారు.

సోమందేపల్లి : 'సిటింగ్ ఎమ్మెల్యే శంకరనారాయణ ముద్దు, ఉషశ్రీచరణ్ వద్దు' అని సోమందేపల్లి మండల కేంద్రంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జెడ్పీటీసీ డిసి. అశోక్, సేవాదళ్ అధ్యక్షులు వేణు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైయస్సార్ సర్కిల్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిటింగ్ ఎమ్మెల్యే శంకర్ నారాయణకు నియోజకవర్గంలో అన్ని రకాల ప్రజలతోనూ మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అలాంటి వ్యక్తి మాత్రమే ప్రతిపక్ష పార్టీని ఢీ కొట్టి వైసీపీ జెండా ఎగరవేయగలరని అన్నారు. నియోజకవర్గానికి ఎలాంటి పరిచయం లేని సొంత నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో అసంతృప్తి తెచ్చుకున్న ఉషశ్రీ చరణ్‌కు సీటు కేటాయిస్తే ఇక నియోజకవర్గంలో వైసిపికి గెలుపు అవకాశాలు పూర్తిగా మూసుకుపోయినట్లేనని అన్నారు. శంకర్ నారాయణకు అవకాశం ఇవ్వకపోతే తాము పార్టీ తరపున పనిచేయలేమనితేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో ఎస్ఎస్ఎ ఉద్యోగుల జలదీక్ష

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ పదోరోజైన శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక చిత్రావతి నదిలో జలదీక్ష చేపట్టారు. అంతకుమునుపు సత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం వద్ద నుండి చిత్రావతి హారతి ఘాట్ వరకు ర్యాలీగా వచ్చి చిత్రావతి నదిలో జలదీక్ష చేపట్టారు. తమ సమస్యల పరిష్కారం కొరకు గత పది రోజుల నుంచి వివిధ రకాలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. దీక్ష అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు బైటాయించి సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామన్న, కార్యదర్శులు ఓబులేషు, ముకుంద, నాగరాజు, వెంకటరమణ, బాబ్జాన్, స్రవంతి, రవి తదితరులు పాల్గొన్నారు.

కనికరం లేని ప్రభుత్వం



ధర్మవరంలో కళ్లకు గంతలు కట్టుకుని అంగన్వాడీల నిరసన

తమ డిమాండ్ల సాధనకోసం 18 రోజులుగా అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తుంటే కనీక కనికరం లేని ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు జిల్లావ్యాప్తంగా 18వ రోజైన శుక్రవారం తమ నిరవధిక సమ్మెను కొనసాగించారు. జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో అంగన్వాడీలు ఎర్రచీరలు, ఎర్రరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తంచేశారు. 'గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనం కావాలి, భగభగ మండే సూర్యున్ని చూడు అంగన్వాడీల సత్తా చూడు, వేతనాలైనా పెంచండి జైలుకైనా పంపండి' నినాదాలతో హోరెత్తించారు.

వార్త 6లో

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసనలు



పోలీసులతో కార్మికుల వాగ్వాదం

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం తమ నిరవధిక సమ్మెను కొనసాగించారు.పుట్టపర్తి, హిందూపురం, ధర్మవరం, మడకశిర మున్సిపల్ కార్యాలయాల ముందు తన ఆందోళన కొనసాగించారు.పుట్టపర్తిలో అధికారులకు, మున్సిపల్ ఉద్యోగులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పుట్టపర్తిలో గణేష్‌గేటు వద్ద చెత్తను తొలగించడానికి ప్రజాప్రతినిధులు పూనుకున్నారు. కొందరు కూలీలను వెంట తీసుకువచ్చి చెత్తను తొలగించే పనిని చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెలో ఉన్న కార్మికులు, నాయకులు విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. సమస్యలు పరిష్కరించకుండా తమ పొట్టకొట్టే చర్యలకు పూనుకుంటారా అని నాయకులు, అధికారులపై మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్త 6లో

8 నుంచి మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

హిందూపురం : జనవరి 8 నుంచి నాలుగు రోజుల పాటు మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తారని, అందరం కలిసి విజయవంతం చేద్దామని వైసిపి నాయకులు వేణురెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేణురెడ్డి, కొండూరు వేణుగోపాల్ రెడ్డి, చిత్తూరు ఎంపి రెడ్డప్ప మాట్లాడుతూ వర్గ విభేదాలను పక్కన పెట్టి అందరం కలిసి విజయమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, పరిశీలకులు శ్రీరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, కొండవీటి నాగభూషణం, కృష్ణమూర్తి, ఎంబి కుమార్, జింకా చలపతి, చంద్రహాస్, మధుమతిరెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణురెడ్డి

పురపాలక సంఘంలో రూ.10కోట్లు అవినీతి..?

అధికారుల అక్రమాలపై అధికార పార్టీ నేత కలెక్టర్‌కు ఫిర్యాదు..!

నేడు జరిగే కౌన్సిల్‌లో చర్చకు వచ్చేనా..?

ఒకటి కాదు, రెండు కాదు హిందూపురం పురపాలక సంఘంలో ఏకంగా రూ.10 కోట్లు అవినీతి జరినట్లు అధికార పార్టీ నేతలే అధికారులపై ఆరోపణలు చేయడమే కాకుండా జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన లెటర్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దీంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌తో పాటు మున్సిపల్ ఉన్నతాధికారులు, ఎసిబి అధికారులు సైతం దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లాలోనే సెలక్షన్ గ్రేడ్ కలిగిన పురపాలక సంఘం హిందూపురం పురపాలక సంఘం. పురపాలక సంఘానికి కోట్ల రూపాయల్లో ఆదాయం ఉంది. దీంతో పాటు ఇతర నిధులు సైతం వందల కోట్లు కోసం వస్తున్నాయి. ఈ నిధులను కేటాయించిన పనులకు మాత్రమే వాడాల్సి ఉంటుంది. అయితే అధికారులు ఆర్థికంగా బాగా లబ్ది చేకూరే పనులను గుర్తించి, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మున్సిపల్ సాధారణ నిధులు సైతం అసాధరణంగా ఖర్చు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతిపై అధికార పార్టీకి చెందిన ఒకరు డిసెంబర్ 7న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో గతంలో ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రస్తుత కమిషనర్ ప్రమోద్ కుమార్, ఇంజనీరింగ్ విభాంగలో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ నాగేంద్ర, అకౌంటెండ్ మనోహర్ కలిసి పురపాలక సంఘంలోని సాధారణ నిధులను దారి మళ్లించి రూ.10కోట్లు మేర స్వాహ చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో డిమాండ్ చేశారు. పురపాలక సంఘంలో జరిగే అభివృద్ధి పనుల్లో వారికి అనుకూలంగా ఉన్నా గుత్తేదారులకు కేటాయించి, 20శాతం కమిషన్ తీసుకుని సిఎఫ్ఎంఎస్‌లో కాకుండా నేరుగ చెక్కులను ఇచ్చారు. ఇది చాలదన్నట్లు ఇంజనీర్ నాగేంద్ర చాల అవకతవకలు చేశారని, పారిశుధ్య నిర్వహణ కోసం బ్లీచింగ్ పౌడర్, సున్నం, బిన్స్ తదితర వాటిని కొనుగోలు చేయకుండానే కొన్నట్లు రికార్డు చేసి, బోగస్ బిల్లులు పెట్టి, బినామి కాంట్రాక్టర్ పేరుతో ఇంజనీర్‌తో పాటు గతంలో పని చేసిన కమిషనర్, ప్రస్తుత కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో పాటు అకౌంటెండ్ మనోహర్‌లు కలిసి నిధులను అడ్డంగా దోచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు డీసిల్టేషన్ పేరుతో కాలువలను ఇటాచితో శుభ్రం చేస్తున్నట్లు రికార్డులను రాసి, ఈ పనులను ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించి, తూ తూ మంత్రంగా పనుల చేసి, నిధులను కొల్లగొట్టినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఆర్థిక నేరంపై సమగ్ర విచారణ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీరిపై విచారణ చేసి చర్యలు తీసుకోక పోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని ఫిర్యాదులో హెచ్చరించారు. ఈ ఫిర్యాదు ఎలా వచ్చిందో తెలియదు కానీ సామాజిక మాధ్యమాల్లో రెండు రోజుల నుంచి హల్‌చల్ చేస్తోంది. దీంతో అవినీతినికి పాల్పడిన అధికారుల్లో ఆందోళన కనిపిస్తోంది. దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు మున్సిపల్ ఉన్నతాధికారులు, ఎసిబి అధికారులు సైతం రహస్య విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు 2020 నుంచి చెక్కుల రూపంలో చెల్లించిన నిధులపై అధికారులు సమగ్ర విచారణ జరిపితే పురపాలక సంఘంలో పెద్ద అవినీతిని బయట పడే అవకాశం ఉందన్న డిమాండ్ వినిపిస్తోంది.



మున్సిపల్ కార్యాలయం

కౌన్సిల్‌లో చర్చకు వచ్చేనా...?

హిందూపురం పురపాలక సంఘంలో జరిగిన రూ.10 కోట్ల అవినీతిపై శనివారం జరిగే మున్సిపల్ అత్యవసర సమయంలో చర్చకు వస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీకి చెందిన వారే ఫిర్యాదు చేయడంతో అధికార, ప్రతి పక్ష కౌన్సిలర్లు చెక్కుల రూపంలో ఇచ్చిన నిధులపై పెద్ద ఎత్తున చర్చ జరిగే అవకాశముంది.

'ఆడుదాం ఆంధ్ర'కు స్పందన కరువు

82 టీములకు 2 జట్లే హాజరు

ప్రజాశక్తి-హిందూపురం

'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభించి 5 రోజులు గడచినా హిందూపురం పురలపాలక సంఘంలో కనీస స్పందన కనిపించడం లేదు. శుక్రవారం క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు గానూ 41 మ్యాచ్‌లు జరగాలి, అంటే మొత్తం 82 టీంలతో క్రీడలు జరగాల్సి ఉంది. ఈ లెక్కన సమారు 500 నుంచి 600 మంది వరకూ క్రీడాకారులు ఎంజిఎం మైదానం చేరుకోవాల్సి ఉండగా కేవలం ఆరుగురు పిడిలు, ఐదుగరురు సచివాలయ సెక్రటరీలు హాజరుకావడం గమనార్హం. 82 టీంలకు గాను 2 టీంలు వచ్చాయి. వారికి ఎవరూ పోటీ లేకపోవడరో పోటీలు నిర్వహించకుండానే హాజరైన వారు గెలిచినట్లు ధ్రువీకరించి, తర్వాతి లెవెల్‌కి ఎంపిక చేస్తున్నట్లు పిడిలు ప్రకటించారు. హిందూపురం పురపాలక సంఘంలో ఆడుదాం ఆంధ్రకు క్రీడాకారుల నుంచే కాదు వార్డు, సచివాలయ సెక్రటరీల నుంచి కూడా స్పందన కనిపించడం లేదు.



.ఎంజిఎం మైదానంలో క్రీడా కారుల కోసం వేచి ఉన్న పీడీలు, అధికారులు



క్రీడా కారులు రాక పోవడంతో వెనుదిరుగుతున్న సచివాలయ సెక్రటరీలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి

◆ మరో ఇద్దరి పరిస్థితి విషమం ◆ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

◆ ట్యూషన్‌కు వెళుతూ ప్రమాదానికి గురైన పదో తరగతి విద్యార్థులు



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి

ప్రజాశక్తి నార్పల

నార్పల మండల పరిధిలోని కేశేపల్లి బ్రిడ్జి వద్ద సిమెంటు లారీ ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... నార్పలకు చెందిన కుమ్మర నారాయణ స్వామి కుమారుడు గౌతమ్, రాజకుల్లాయప్ప కుమారుడు రాజుకుల్లాయప్ప, నార్పలలోని సుల్తాన్ పేటకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు అభిషేక్ రెడ్డి, బొందలవాడ గ్రామానికి చెందిన బ్రహ్మయ్య కుమారుడు విష్ణు నార్పల ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. వీరు నలుగురు మంచి స్నేహితులు. వీరు పాఠశాల సమయం ముగియగానే సమీపంలోని కేశేపల్లిలో ట్యూషన్‌కు వెళుతుండేవారు. రోజు మాదిరిగానే శుక్రవారం పాఠశాల సమయం ముగియగానే ఒకే ద్విచక్రవాహనంలో ట్యూషన్ కోసం కేశేపల్లికి బయలు దేరారు. అదే సమయంలో సిమెంట్‌లోడుతో తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వీరి ద్విచక్రవాహనాన్ని కేశేపల్లి బిడ్జి వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌతమ్ (15), విష్ణు(15) అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకుల్లాయప్ప, అభిషేక్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు గాయపడిన వారిని 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే మృతుల, క్షతగాత్రుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుల బంధువులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. భవిష్యత్తుపై ఉన్నత ఆశలతో ప్రతిరోజు పాఠశాల అయిపోగానే ట్యూషన్ కి వెళ్లి చదువుకొంటున్న విద్యార్థులు జీవితాలు అర్ధాంతరంగా ముగియడంతో వారి కుటుంబసభ్యులు ఆశలను లారీ రూపంలో ఆవిరయ్యాయి. మృతిచెందిన విద్యార్థి గౌతం తండ్రి నారాయణస్వామి నార్పలలో డ్రైవర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు నారాయణస్వామికి గౌతమ్ ఏకైక కుమారుడు కావడంతో ఆ తల్లిదండ్రుల రోదన వర్ణాతీతంగా మారింది. సంఘటనా స్థలాన్ని ఎస్సై రాజశేఖర్ రెడ్డి సందర్శించి మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించారు





విద్యార్థులు గౌతమ్, విష్ణు (ఫైల్‌ఫొటోలు)

ఎర్ర రిబ్బన్లు, చీరలతో అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అంగన్వాడీలు 18వ రోజైన శుక్రవారం సమ్మెను కొనసాగించారు. పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం ముందు ఎర్రచీరలు, తలకు ఎర్రరిబ్బన్ ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడీలపై కనికరం చూపేలా సిఎం జగన్‌కు బుద్ధి ప్రసాదించాలని విజయవాడ కనకదుర్గమ్మను వేడుకున్నట్లు తెలిపారు. 'గౌరవ వేతనం మాకొద్దు కనీస వేతనం కావాలి, భగభగ మండే సూర్యున్ని చూడు అంగన్వాడీల సత్తా చూడు, వేతనాలైనా పెంచండి జైలుకైనా పంపండి' నినాదాలతో హోరెత్తించారు. వీరికి సిఐటియు నాయకులు బ్యాల్ల అంజి మద్దతు తెలిపారు. దీక్షలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు, కోశాధికారి, సుజాత, నాగమణి, సెక్టార్ నాయకురాళ్లు యశోదమ్మ, మంజుల, షర్మిల, మూడు మండలా ల అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **ధర్మవరం** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రకళ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు ఆదినారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, అంగన్వాడీలు పోతక్కదీనా, మాంచాలినిదేవి, అనిత, క్రిష్ణవేణి, భువనేశ్వరి, లలిత పాల్గొన్నారు. **సోమందేపల్లి**లోని సాయిబాబా గుడి ఆవరణలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెను కొనసాగించారు. ప్రజాశక్తి దినపత్రికలో సమ్మెపై ప్రచురించిన స్పెషల్ పత్రికను దీక్షా శిబిరంలో ఆవిష్కరించారు. దీక్షలో యూనియన్ సభ్యులు అనురాధ, చంద్రకళ, సిఐటియు నాయకులు నారాయణస్వామి, కిష్టప్ప, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు. **నంబులపూలకుంట** ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు దీక్షలను కొనసాగించారు. శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్ నరసింహులు, సభ్యుడు జగన్మోహన్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల సభ్యులు నాగరాజు, అంగన్వాడీ యూనియన్ సభ్యులు రజియా, భాగ్య, చంద్రకళ, సావిత్రి, సలీమా, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. గాండ్లపెంటలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాలు లక్ష్మీదేవి, సుజాత, భారతి ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. దీక్షలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **అమరాపురం** తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెను కొనసాగించారు. దీక్షలో సిఐటియు నాయకుడు మహబూబ్‌ఖాన్, యూనియన్ లీడర్లు నాగమణి, అనసూయమ్మ, మంజుల, చంద్రకళ, నాగరత్నమ్మ, సారక్క, తదితరులు పాల్గొన్నారు. **మడకశిర** పట్టణంలో అంగనవాడీ కార్యకర్తలు రిలే నిరాహార దీక్షకు పూనుకొన్నారు. దీక్షలో యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, పద్మ, ఆరీఫా తదితరులు పాల్గొన్నారు. **ఓబుళదేవరచెరువు** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, అంగన్వాడీ సిబ్బంది రంగమ్మ, మణిమాల, ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ, కమలమ్మ, వరలక్ష్మి, అరుణమ్మ, అనసూయ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు. **చిలమత్తూరు**లో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో



హిందూపురం : దీక్షలో పాల్గొన్న అంగన్వాడీలు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, అంగన్వాడీ సంఘం నాయకురాళ్లు శోభమ్మ, పద్మావతి, రామతులసి, ఈశ్వరమ్మ, బృందమ్మ, శారద, పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు. **ముదిగుబ్బ**లో తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి సిపిఎం సిఐటియు నాయకులు అండగా నిలిచారు. దీక్షలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, వెంకటేష్, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, ఇందుమతి, హెల్పర్లు పాల్గొన్నారు. **కదిరి** పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు దీక్షలను కొనసాగించారు. దీక్షలో సిఐటియు నాయకుడు జివిఎల్.నర్సింహులు, జగన్మోహన్, మాబున్నీసా, పాల్గొన్నారు. **హిందూపురం** పట్టణంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, సిఐటియు ర్యాలీ నిర్వహించి, సద్భావన సర్కిల్లో దీక్ష చేపట్టారు. దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడిపి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు సదాశివరెడ్డి, శివప్ప, ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, నాయకులు శిరీష, శైలజ, శోభ, నాగమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు. **గుడిబండ**లో ఆంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ, కోశాధికారి లక్ష్మీదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.



పుట్టపర్తి : ఎర్ర చీరలు ధరించి దీక్షలో పాల్గొన్న అంగన్వాడీలు



కదిరి : పూలమాలలు వేసుకుని దీక్ష



నంబులపూలకుంటలో..

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం కూడా సమ్మెను కొనసాగించారు. ఈ సమ్మె నేపథ్యంలో పట్టణంలో పేరుకుపోయిన చెత్తను ప్రయివేట్ వ్యక్తులతో తొలగించేందుకు పూనుకోగా సమ్మెలో ఉన్న కార్మికులు, సిఐటియు నాయకులు ప్రధాన రహదారి గణేష్ గేట్ వద్ద వారిని అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకుడు నారాయణరెడ్డి కార్మికులతో వాగ్వాదానికి దిగారు. పట్టణ సిఐ కొండారెడ్డి పోలీసులతో అక్కడికి చేరుకోగా పోలీసులు, కార్మికుల మధ్య జరిగిన తోపులాటలో కార్మికురాలు మారెక్క సొమ్మసిల్లి పడిపోయింది. చివరికి వారు కార్మికులకు సర్ది చెప్పి ప్రధాన రహదారిలో మాత్రమే తొలగిస్తామని చెప్పడంతో కార్మికులు వెనుదిరిగారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగార్జున, రామయ్య, పెద్దన్న, గోవిందు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేస్తున్న సమస్యలు న్యాయమైనవేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కార్మికులు నిరసన దీక్షకు టిడిపి జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు కోనంకి గంగాధర్, చెన్నకేశవులు, జనసేన జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డాక్టర్ తిరుపతేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పురంలో రోడ్డుపై వంటావార్పు

హిందూపురం : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడిపి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమం చేపట్టి, ప్రధాన రహదారిపై భోజనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాంబశివ, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జగదీష్, ఆనంద్, మల్లికార్జున, నాయకులు ఆనంద్, గురు నాథ్, బాబయ్య, చంద్ర, రంగనాథ్, సిఐటియు నాయకులు రాజప్ప, రామకష్ణ, కిరణ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, రామచంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన

ధర్మవరం టౌన్ : సమ్మెలో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం పట్టణంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛను, హెల్త్, రిస్క్ అలవెన్సులు, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం, తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. దీక్షలో మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ సలహాదారు పెద్దక్కవెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగ కార్మిక



హిందూపురం : రోడ్డుపై భోజనం చేస్తూ నిరసన

సంఘం అధ్యక్షుడు ఆ్రడా మహేశ్, ప్రధాన కార్యదర్శి బొగ్గు నాగరాజు, సహాయ కార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరి సురేశ్, అంకె పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న మద్దతు

మడకశిర : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్షను కొనసాగించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న మద్దతు తెలిపారు. దీక్షలో డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు, రాజగోపాల్, కృష్టప్ప, రంగనాథ్, నాగరాజు, మూర్తినాయక్, ఈశ్వర్‌సాగర్, ఛత్రం శివ, మెలవాయి శివ, రామంజప్ప, నరసేగౌడ్, శ్రీనివాసులు, శివన్న, గంగాధర్, శంకర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ధర్మవరంలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



పుట్టపర్తిలో కార్మికులతో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి



విసి నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న కీర్తి

ఎంఎ ఇంగ్లీషులో ధర్మవరం విద్యార్థినికి ఫస్ట్ ర్యాంకు

ధర్మవరం టౌన్ : పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న చెన్నకేశవులు కుమార్తె సాయికీర్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఎంఎ ఇంగ్లీష్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకుందని తండ్రి చెన్నకేశవులు తెలిపారు. సాయి కీర్తి యూనివర్సిటీ విసి సీతారామారావు నుంచి గోల్డ్ మెడల్ అందుకుందన్నారు. కీర్తికి పోలీసులు, స్నేహితులు, అభినందనలు తెలిపారు.

పురంలో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి

హిందూపురం : పట్టణంలో ప్రభుత్వ కళాశాలలు లేక విద్య వ్యాపారంగా మారిందని, వెంటనే ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కళాశాల వసతి గృహం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల, మోడల్ డిగ్రీ కళాశాలలకు స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు నరసింహమూర్తి, తరుణ్, గోపి, దేవరాజు, గోపాల్, మంజునాథ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యపై ధర్నా

కొత్తచెరువు : డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ముస్లిం కాలనీకి చెందిన 100 మందికి పైగా ప్రజలు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్థానిక దర్గా ప్రాంతంలో డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపైనే మురికి నీరు ప్రవహిస్తుందని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారను. పలుమార్లు పంచాయతీ వారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. సమస్యను పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని సర్పంచి భర్త నాగరాజుకు తెలపడంతో ఆయన అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి

మడకశిర : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జికె ఈరన్న తెలిపారు. రొళ్ల మండలం గుడ్డుగుర్కి, జిఎన్ పాల్యం, కేతప్పపాలెం, అవినకుంటతండా, హనుమంతుని పల్లి గ్రామాల్లో శుక్రవారం టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, పాండురంగప్ప, క్రిష్టప్ప, భరత్, హేమంత్, వెంకటేష్, రామచంద్రప్ప, శివన్న, తిమ్మయ్య, నగేష్, మారెన్న, నాగేంద్ర, సుబాన్, కృష్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రొళ్లకు ఉపాధి హామీ కేంద్ర బృందం

మడకశిర : రొళ్ల మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ చేపట్టిన ఉపాధి పనులు, కన్వర్జెన్సీ పనులను తనిఖీ చేసేందుకు కేంద్ర సామాజిక తనిఖీ బృందం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుంది. ఆ బృందం సోమవారం నుంచి గ్రామాలకు వెళ్లి పనులను తనిఖీ చేస్తుందని ఎస్ఆర్‌పి కాంతయ్య తెలిపారు.

ఎన్నికల ఫిర్యాదులను పెండింగ్ ఉంచొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో రాజకీయ పార్టీల నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం పెండింగ్ దరఖాస్తుల స్థితి, ముసాయిదా జాబితా, ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీ ప్రతినిధుల ఫిర్యాదులు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అందులో కలెక్టర్‌తో పాటు జెసి అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, డిఆర్ఒ కొండయ్య, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వసతులు సంసిద్ధం చేసుకోవా లన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్య ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, రమేష్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారంను సీజ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లిలో ఉన్న కోళ్లఫారంను వెంటనే సీజ్ చేయాలని సిపిఎం నాయ కులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దాదిరెడ్డిపల్లి, తండా గ్రామస్తు లు సిపిఎం ఆధ్వర్యంలో కోళ్లఫారం గేటు ముందు ధర్నా నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కోళ్లఫారం వ్యర్థాల వల్ల గ్రామంలో నెల రోజులుగా ఈగలు విపరీతంగా ప్రబలి ప్రజలు, పశువులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ విషయమై ఎంపిడిఒ ఆఫీస్ ముందు ఆందోళన చేయగా అధికారులు కోళ్లఫారం యజమానికి నోటీసులిచ్చి సరిపెట్టుకున్నారన్నారు. విషయం తెలుసుకున్న ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, సిఐ వేణు గోపాల్, ఎస్ఐ గంగాధర్ అక్కడికి చేరకుని గ్రామస్తులకు



సిపిఎం, ఆందోళనకారులతో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. అలాగే కోళ్లఫారం యజమాని శంకర్‌రెడ్డిని పిలిపించి ఈగలు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, సమస్య పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చ రించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చందు, సుధాకర్, దాదిరెడ్డిపల్లి, తండావాసులు పాల్గొన్నారు.

బెస్ట్ యూనివర్శిటీలో చిరుధాన్యాలపై సదస్సు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

చిరుధాన్యాలపై 'బెస్ట్' యూనివర్సిటీలో శుక్రవారం 'బెస్ట్' జాతీయ సదస్సు నిర్వహించినట్లు యూనివర్సిటీ అధికారులు డా. రామ్ గోపాల్ తెలిపారు. వర్షాపాతం తక్కువ ఉన్న రాయలసీమ ప్రాంతం చిరుధాన్యాలు(కొర్రలు, సామలు, సజ్జలు, జొన్నలు) పండించేందుకు అనువైందని, కావున ఏటా చివరిలో ఇలాంటి కార్యక్రమం చేపట్టి రైతులు, విద్యార్థులకు సైంటిస్టుల ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వడమే సదస్సు ఉద్దేశం అన్నారు. సదస్సుకు నార్మ్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సైంటిస్టు మ్యాంగ్రు డా. చంద్ర మోహన్ రెడ్డి, ఇండస్ట్రీ ఆఫ్ మిలిటరీ శ్రీనివాస్‌బాబు, న్యూట్రిషన్ స్పెషలిస్ట్ భార్గవి, ఎన్జీవో నుంచి డైరెక్టర్లు, సిఇఒలు హాజరయ్యారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని సిరిగారిపల్లి, పెద్దన్నగారిపల్లి, పైపేడు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సాధ్యమని ప్రజలకు వివరించారు. అనారోగ్యంతో వీల్ చైర్‌పై ఉన్న వ్యక్తిని పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, బాలముని, సర్పంచి పాపయ్య, కార్యకర్తలు ఉన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

మండల పరిధిలోని కొండగట్టుపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారన్నారను. కార్యక్రమంలో సర్పంచి పాపయ్య, డాక్టర్ నాగేంద్ర, వైద్య సిబ్బంది వేణుగోపాల్, నర్సులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : పరిటాలశ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి పాలనలో పట్టణంలో అభివృద్ధి శూన్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరా మ్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయం లో శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో టిడిపి చేపట్టే పాదయాత్ర తో వైసిపి నాయకుల గుండెల్లో వణుకు పుట్టాలన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే దశల వారీగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కాటమయ్య, ఫణికుమార్, కాచర్ల కంచన్న, చింతపులుసు పెద్దన్న, పురుషోత్తం గౌడ్, గరుగు వెంగప్ప, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నా యుడు, రాళ్లపల్లి షరీఫ్, చట్టా లక్ష్మీనారా యణ, మాదన సుబ్బయ్య, బొట్టు కిష్ట, పల్లపు రవీంద్ర, కత్తుల బాబ్జి, సంజీవులు, అ్రడా మహేశ్, ముతకూరు బీబీ, బానూబి, మున్నీ పాల్గొన్నారు. టిడిపిలో కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత లభిస్తుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం చిన్నూరు గ్రామానికి చెందిన వైసిపి



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

నాయకులు షామీర్, రమేష్ టిడిపిలో చేరగా శ్రీరామ్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. శ్రీరామ్ మాట్లాడుతూ వార్డుల్లో అందరూ సమన్వయంతో సమిష్టిగా కృషి చేసి పార్టీ విజయానికి పాటుపడాలన్నారు.

టిడిపితోనే ముస్లిముల అభివృద్ధి

టిడిపితోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డులో ముస్లింలకు యాసిన్‌పీరా ఫొటోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం సూరి, భీమల రామాంజి, రాజు, రామాంజి, రవి, జనార్ధన్, కార్తీక్‌బాబు, చిరంజీవి, అమర్నాథ్‌చౌదరి, అఖిల్, అల్లాబకాష్ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

పోలీసులు సమర్థవంతంగా పని చేయాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. కేసుల్లో పురోగతి సాధించాలని, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లపై నిరంతరం నిఘా ఉంచాల న్నారు. వారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. క్రిమినల్ కేసుల్లో నిందితు లకు శిక్షలు పడేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. అనంతరం 3 నెలల నుంచి జిల్లాలో జరిగిన వివిఐపిలు, విఐపిల సభలకు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, తదితర వాటిలో బాగా పని చేసిన 153 మందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఎఎస్పీ విష్ణు, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడలతో ఉల్లాసం : డిఐజి

పుట్టపర్తి రూరల్ : క్రీడలు మానసికంగా, శారీరకంగా ఎంతో ఉల్లాసం కల్గిస్తాయని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్ అమ్మిరెడ్డి తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పరేడ్ మైదానంలో అన్ని సబ్ డివిజన్లలోని పోలీసు క్రీడాకారులతో స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్ నిర్వహించారు. శుక్రవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి డిఐజి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు నిత్యం విధుల్లో ఎంతో ఒత్తిడికి గురవుతుంటారని, అయితే క్రీడలు, వ్యాయామం వల్ల ప్రతి ఒక్కరికీ ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఎఎస్పీ ఎన్.విష్ణు, ఎఆర్ డిఎస్‌పి జెడ్ విజయ్‌కుమార్, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, శ్రీలత, హుస్సేన్‌పీరా, కంజక్షన్, ఎస్బి సిఐ రవీంద్రారెడ్డి, ఎఆర్ ఆర్ఐలు టైటాన్స్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు, సిఐలు, ఎస్ఐలు పోలీసులు, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోలుపై శిక్షణ

ధర్మవరం టౌన్ : మద్దతు ధరకు కందుల కొనుగోలుపై శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో సమావేశ మందిరంలో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం, కనగానపల్లి, సికె పల్లి, రామగిరి మండల ఆర్‌బికె సిబ్బంది, వ్యవసాయ ఉద్యాన పట్టు సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ధర్మవరం సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య కందుల కొనుగోలు యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ అశ్వర్థనారాయణనాయక్, మార్క్‌ఫెడ్ డిఎం గీత, ఎఒలు రమాదేవి, ఓబిరెడ్డి, ముస్తఫా, ఉదయ్‌కుమార్, మురళి, కృష్ణకుమారి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు

ముదిగుబ్బ : మండల పరిధిలోని గాండ్లవారిపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ అధికారులు కంది, పెసర పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, ఎఒ లక్ష్మినరసింహులు, ఎఎస్ఒ చంద్రశేఖర్, ఎఇఒ షరీఫ్, ఎంపిఇఒ ఆశ, అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

29,481 మందికి 'విద్యాదీవెన' లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విద్యా దీవెన పథకం ద్వారా జిల్లాలో 29,481 మంది విద్యార్థులకు రూ. 20.72 కోట్లు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి శుక్రవారం సిఎం జగన్ విద్యా దీవెన త్రైమాసం నిధులను విడుదల చేశారు. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జిల్లా అగ్రి బోర్డు ఛైర్మన్ అవుటాల రమణా రెడ్డి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్, ఇతరులు

ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తుందన్నారు. నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తోందన్నారు. పథకాలను విద్యార్థులు వినియోగించుకుని భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్, ప్రజాప్రతినిధులు మెగా చెక్కును విడుదల చేశారు.

సాగుదారులకే భూములు ఇవ్వాలి

ప్రజాశక్తి-రొద్దం

మండల పధిలోని కోగిర రెవెన్యూ పొలం సర్వే నంబర్-669లో ఉన్న భూమిని సాగు చేసుకుం టున్న నిరుపేదలకే ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ అనంతా చారికి వినతిపత్రం అందజేశారు. వ్య.కా.సం. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి నిరుపేదలు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదని మండిపడ్డారు. జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ పేదలకు న్యాయం చేయకపోతే దీర్ఘకాలిక పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన తహశీల్దార్ పేదల



తహశీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన పేదలు

దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపించి తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. ధర్నాలో వ్య.కా.సం. జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, వెంకటరాముడు, సాగుదారులు అనితమ్మ, రామాంజనమ్మ, లింగమ్మ, జయమ్మ, నిర్మల, నరసింహులు, చిన్నఅంజన్నప్ప, సత్యనారాయణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణ అభివృద్ధికి అందరూ మరింత సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ కోరారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు పెరిగాయి. ముందుగా జెఎఒ శ్రీనివాసులు బడ్జెట్ అంశాలపై చదివి వినిపించారు. 2023-24కి రూ. 50,71,98,840 బడ్జెట్ అంచనాలు రూపొందించగా మిగులు బడ్జెట్ కింద రూ. 5,28,67,510 ఉందన్నారు. 2024-25కి రూ. 76,82,34,259 బడ్జెట్ అంచనాలు రూపొందించగా మిగులు బడ్జెట్ కింద రూ. 1,34,38,263 అంచనాలు వేశారు. పట్టణంలోని నిరాశ్రయుల కేంద్రాల్లో పర్యవేక్షణ లేదని కౌన్సిలర్ పురుషోత్తంరెడ్డి తెలిపారు. జెసిబి



మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు బడ్జెట్ అంశాలను వివరిస్తున్న కమిషనర్ బండిశేషన్న

రమణ మాట్లాడుతూ పట్టణంలో శ్మశానవాటిక సమస్య ఉందన్నారు. ప్రధాన సర్కిళ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కో ఆప్షన్ మెబర్ రామకృష్ణ కోరారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ షేక్‌షంషాద్ బేగం, కమిషనర్ బండి శేషన్న, మేనేజర్ ఆనంద్, ఎఇలు ప్రతాప్, హరీశ్, కళావతి, శిరీష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, శ్యాంసన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

బిసిల ద్రోహి సిఎం జగన్ : సవితమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ

బిసిల ద్రోహి సిఎం జగన్ అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి బిసిలకు సముచిత స్థానం కల్పించింది టిడిపినే అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక బిసాలను ఇబ్బంది పెట్టారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్ తగ్గించింది, ఆదరణ పథకాన్ని రద్దు చేసింది వైసిపినే అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎమ్మెల్యేల మీద నెట్టి తప్పించుకోవడం జగన్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. జగన్ వ్యవస్థలను విధ్వంసం చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, డివి ఆంజనేయులు, వెంకటేష్, ఆదిశేషారెడ్డి, గోవిందరెడ్డి, సూర్యనారాయణ, ప్రసాద్, రంగప్ప, త్రివేంద్రనాయుడు, మంజునాథ్, నాగభూషణ, శ్రీనివాసులు, బాబు, శ్రీకాంత్, చంద్ర, గోపి, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల పరిధిలోని బండ్లపల్లి పంచాయతీ పొలాల్లో పదేళ్ల నుంచి నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పనులను శుక్రవారం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ టీం సభ్యులు శృతిగుప్తా, సీనియర్ సైన్సెస్ అనీషా, అజీమ్, రావత్, పరశు రాం, శ్రీనివాస, అనిల్, గోవిందాచారి పరిశీలించారు. ఫారం పాండ్ తవ్వకాలు, మామిడి తోటల్లో వాటర్ షెడ్ కింద జరిగిన పనులు నాణ్యతగా ఉన్నాయా లేవా అని పరిశోధన చేశారు. నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు, రైతులు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారి వెంట ఎపిడి రఘునాథరెడ్డి, ఎపిఒ నాగిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, నరసింహులు, రామ్మోహన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు హేమాద్రి, సురేంద్ర, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేష్, బాబాఫకృద్దీన్, తదితరులు ఉన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

'పది' పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి సూచించారు. స్థానిక కెజిబివిలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ ఉచితంగా పంపిణీ చేశారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ వీటిని చెన్న భారతి జ్ఞాపకార్థం ఆమె తల్లిదండ్రులు త్యాగరాజు, భారతి అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఒ చంద్రకళ, యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ రమావత్, రామకృష్ణ, నాయకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రొద్దం : ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) రూపొందించిన క్యాలెండర్, డైరీని శుక్రవారం స్థానిక కెజిబివిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ సమక్షంలో ఎంఇఒలు ఆంజనేయులు నాయక్, జయభాస్కర్, ఎస్ఒ నాగరత్నమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి మారుతి, మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ, దేవి, శివయ్య, చిన్న వెంకటేష్, రమేష్, ముత్యాలు, నరేష్, రాజశేఖర్, మల్లికార్జున, మారుతిరెడ్డి, శీన, గోపి, రత్నమ్మ, మౌనిక, విద్యాజ్యోతి పాల్గొన్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుకొండ : యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒలు చంద్రశేఖర్, ఎం.సుధాకర్ యుటిఫ్-2024 డైరీ, క్యాలెండర్, అధ్యాపక దర్శినిలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్, ఉపేంద్ర, జి.రమేష్, గౌరవాధ్యక్షులు కృష్ణానాయక్, రవీంద్రనాథ్, రామాంజినేయులు, పెద్దరాజు, నాగేంద్ర, జె.నరేష్, సరస్వతీబాయి, రాధామణి, ఎం.నాగమణి, బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

పుట్టపర్తి అర్బన్ : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం యుటిఎఫ్-2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కందుకూరి శివ, లక్ష్మీనారాయణ, నాయకులు నరేష్, గోపి, చంద్ర, కష్ణ, రమేష్, సుధాకర్, రామంజి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి పోటీలకు హరీష్ స్కూల్ విద్యార్థులు

కదిరి టౌన్ : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు హరీష్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల బుక్కపట్నంలో ఉమ్మడి అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహంచగా రంగనాథ్, జశ్వంత్, చరణ్‌నాయక్, చరణేశ్వర్, శైలజ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 30, 31వ తేదీల్లో ప్రకాశం జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ప్రిన్సిపల్‌తో పాటు హెచ్‌ఎం బాదుల్లా, పిఇటి ఖాదర్‌వలి, ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

'జలకళ' మోటర్లు పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెట

మండల పరిధిలోని మద్దివారిగొంది వద్ద ఉన్న రైతు ఆది బయన్న తోట వద్ద శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి రైతులకు జలకళ మోటర్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ జలకళ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రైతుల పొలాల్లో బోర్లు వేసి ఉచితంగా 10 హెచ్‌పి మోటర్లు, స్టార్టర్లు, విద్యుత్ కనెక్షన్‌లను ఉచితంగా అందజేస్తుందన్నారను. కార్యక్రమంలో ఎంపిపి టి. జగన్మోహన్, భాస్కర్‌రెడ్డి, సర్పంచి రవీంద్రనాయక్, నాయకులు ఆంజనేయులు, నాగభూషణంరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాసనాయక్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

'మార్చాల్సింది అభ్యర్థులను కాదు సిఎం జగన్‌నే'

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైసిపిలో మార్చాల్సింది ఎమ్మెల్యే అభ్యర్థులను కాదని సిఎం జగన్‌ను మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పెనుకొండ నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు కురుబ కృష్ణమూర్తి ఎదేవా చేశారు. సోమందేపల్లిలో శుక్రవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఎమ్మెల్యే అభ్యర్థులను మారుస్తున్నారన్నారు. ఒక నియోజకవర్గంలో విఫలమైన వ్యక్తి ఎక్కడికెళ్లినా విఫలమవుతారనే విషయాన్ని వైసిపి పెద్దలు గమనించలేకపోతున్నా రన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో వైసిపికి ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలయిక పట్ల ప్రజలు నూతన ఉత్సాహంతో ఉన్నారని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తామన్నారు. టిడిపి తరపున పెనుకొండ సీటు ఎవరికి కేటాయించినా గెలిపిస్తామన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి బగ్గిరి త్రివేణి, ఎంపిడిఒ సాయిమనోహర్ సూచించారు. మండల పరిధిలోని తంబాపురం, ఓబుళాపురం గ్రామ సచివాలయాల ఆవరణలో శుక్రవారం సర్పంచులు స్థానే జయచంద్రారెడ్డి, బండి సరస్వతి అధ్యక్షతన 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' గ్రామసభలు నిర్వహించారు. ఇందులో వైద్య ఆరోగ్య శిబిరంతో పాటు వంటగ్యాస్ కోసం కౌంటర్లు ఏర్పాటు చేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి దివాకర్, వైద్యాధికారి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వరలక్ష్మి, ఎపిఎం సుదర్శన్‌రాజు, ఎఒ ఓబిరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రమ్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-అమరాపురం

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం దళిత యువ నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. విగ్రహ ఏర్పాటుకు ఉపాధ్యాయుడు నరసింహమూర్తి రూ. 5వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, జడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి, గడ్డం రాజు, కన్వీనర్ త్రిలోక్‌నాథ్, సర్పంచి శివలింగప్ప, నారాయణప్ప, నరసింహమూర్తి, కెంచప్ప, ముదరాజు దేవరాజు, శంకర్, ఈశ్వరప్ప,సురేష్, తిమ్మరాజు, సిద్దేశ్వర, తిప్పేస్వామి, ప్రసాద్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సిఐపై డ్వాక్రా మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి -పెనుకొండ

డ్వాక్రా మహిళలను వేధిస్తున్న సిఒ నబిరసూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవకి వినతి పత్రం సమర్పించారు. డ్వాక్రా మహిళలు, సిఐటియు నాయకులు మాట్లాడుతూ తిమ్మాపురం శ్రీవెంకటేశ్వర మహిళా పొదుపు సంఘం సభ్యులు రుణాలు తీసుకొని రెగ్యులర్‌గా చెల్లిస్తున్నారన్నారు. సంఘం ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదని సిఒ వద్దకు సంతకం కోసం వెళ్తే 2 నెలల నుంచి ఆఫీస్ చుట్టూ తిప్పుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, తిప్పన్న, ఐకెపి యానిమేటర్స్ లక్ష్మీదేవి, నారాయణ, సుభద్రమ్మ, శారదమ్మ, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.



సిఒపై ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా సంఘం సభ్యులు

బాల్య వివాహాలను అరికడదాం

మడకశిర : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ముఖ్య అతిథులు ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ లీలావతి, శంకరమ్మ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆమిదాలగొంది జడ్పి హైస్కూల్‌లో శుక్రవారం ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిటి టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన 'పది తర్వాత పెళ్లి కాదు పదకొండు' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చిన్నారులకు లఘుచిత్రాల ద్వారా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, మంచి, చెడు స్పర్శ, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు మూల్యప్ప, శ్రీనివాసరెడ్డి, చిన్నారులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజుపల్లి గ్రామంలో శుక్రవారం పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాతాశిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులు, వ్యాయామామం, డ్రై డే ఫ్రైడే, పోషకాహారం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రజలు కుష్టు వ్యాధికి గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆశా కార్యకర్త జ్యోతి, యానిమేటర్ వెంకటరాముడు పాల్గొన్నారు.



కుష్టుపై అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

బత్తలపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సిఎం జగన్ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపిపి బగ్గిరి త్రివేణి తెలిపారు. మండల పరిధిలోని అప్పరాచెరువు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసి క్రీడా పోటీలను శుక్రవారం సర్పంచి మర్రెడ్డిగారి శారదమ్మ ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నాల్గొవ రోజు క్రీడా పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు. ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంత బాలోత్సవ్‌కు ఆత్మీయ ట్రస్ట్ చేయూత

మడకశిర : ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అనంత బాలోత్సవ్-2024కు శుక్రవారం ధర్మవరం పట్టణానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ వారు రూ. 20వేల చెక్కును బాలోత్సవ్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.సావిత్రికి అందజేశారు. కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, భూతన్న, అనంతపురం జిల్లా ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి ఎన్. రమణారెడ్డి, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు జశ్వంత్, కృష్ణజ పాల్గొన్నారు.

కొర్లకుంటలో టాస్క్‌ఫోర్స్ టీమ్ పర్యటన

చిలమత్తూరు : వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు శుక్రవారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కుష్టు సర్వేపై ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం దేమకేతేపల్లి పంచాయతీ కోర్లకుంటలో పర్యటించి స్కూల్ పిల్లలకు, కౌమార దశలో ఉన్న ఆడపిల్లలు, గర్భిణులు, బాలింతలకు రక్త హీనత పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ నికేష్ తెలిపారు. కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టార్ కుళ్లాయప్పనాయక్, పర్యవేక్షకులు గోపి, గోవిందప్ప, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం గర్భిణులకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో పండ్లు, జాకెట్ పీసులు పంపిణీ చేసినట్లు అధ్యక్షులు తల్లం నారాయణమూర్తి తెలిపారు. వారు మాట్లాడుతూ గర్భిణులు సకాలంలో మందులు వేసుకుంటూ, ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, ఉపాధ్యక్షులు జింక చిన్నప్ప, సహాయ కార్యదర్శి మంజునాథ్, జగ్గా వేణుగోపాల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తిప్పేస్వామిపై తిరుగుబాటు

అమరాపురం : అధికార పార్టీకి చెందిన మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని సొంత పార్టీలోని నాయకులే మాకొద్దు అంటూ తిరుగుబాటు చేశారు. అమరాపురంలో శుక్రవారం వైసిపి ఎంపిటిసిలు నారాయణ గౌడ, హనుమంత రాయప్ప, కెంచప్ప, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు ప్రకాష్, ముఖ్య నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మడకశిర ఎమ్మెల్యే టికెట్‌ను తిప్పేస్వామికి ఇస్తే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని తేల్చి చెప్పారు. పార్టీ బలోపేతం కావాలన్నా, పార్టీ అభ్యర్థిని మళ్లీ గెలిపించుకోవాలన్నా కొత్త వ్యక్తికి టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, దానేగౌడ్, ఈరన్న, ఎంజేరేగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

చిలమత్తూరు : వైసిపి అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని వైసిపి నాయకులు స్పష్టం చేశారు. చిలమత్తూరులో శుక్రవారం వైసిపి నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధిష్టానం ఎవరికి బాధ్యతలు ఇస్తే వారి నాయకత్వంలో పని చేశామని, ఇప్పుడు దీపిక వేణురెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామన్నారు. స్థానికంగా నాయకుల మధ్య చిన్న చిన్న అపార్థాలు ఉండొచ్చు కానీ అంతిమంగా అందరూ పార్టీ నిర్ణయాన్ని గౌరవించి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకత్వం బలంగా ఉందని హిందూపురంలో వైసిపి జెండా ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి రఘు, సర్పంచి సంధ్య, దేమకేతేపల్లి తిరుమలేష్, జనార్ధన్‌రెడ్డి, బాబేనాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేత మృతికి సంతాపం

బత్తలపల్లి : మండల పరిధిలోని కాటమకుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు బి.వెంకటనారాయణరెడ్డి(69) కొంత కాలంగా వెన్నెముక నొప్పితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. అతడికి భార్య సన్నబయమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 13వ తేదీ అతడి అన్న వెంకటరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, ఎంపిపి బగ్గికి త్రివేణి, జడ్పీటీసీ కోటి సుధ, గొల్లపల్లి రామకష్ణారెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, బగ్గిరి బయపరెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు.